క్లుప్తంగా

మహిళలపై దాడుల్ని అరికట్టాలి



రాంబిల్లిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాణిక్యం

రాంబిల్లి: మహిళలపై హింసాత్మక ఘటనలను నియంత్రించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం అన్నారు. రాంబిల్లి, పెదకలవలాపల్లి గ్రామాల్లో ఆదివారం ఆమె మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్నేళ్ల స్వతంత్ర భారతావనిలో ఇప్పటికీ మహిళలపై హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న చలపతిరావు

రాంబిల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు అన్నారు. మన ఊరు మన వంతు సేవ తరఫున నూకాంబిక యువసేన ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు దిమిలిలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ హరిచందన 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 35 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌కుమార్, సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, శానాపతి అప్పారావు, బొద్దపు మాణిక్యం, కన్నం బాలాజీ పాల్గొన్నారు.

ఎన్‌పీఎం షాపు ప్రారంభం



హరిపాలెంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో ఎన్‌పీఎం(ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం) షాపును ఆదివారం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ డీపీఎం లచ్చన్న సూచనల మేరకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఈ షాపులో రైతులకు అందిస్తామని యజమాని భీమిశెట్టి వెంకట జగ్గప్పారావు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా రైతులను కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ నాయుడు బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై ప్రత్యేక డ్రైవ్



బీఎల్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

నక్కపల్లి: ఓటర్ల జాబితా పరిశీలనపై ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పెదతీనార్ల గ్రామంలో పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ అంబేద్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి పరిశీలనలో గుర్తించిన మార్పులు, చేర్పులు పక్కాగా ఉండాలని సూచించారు. అవకతవకలకి, పొరపాట్లకు ఎలాంటి ఆస్కారం ఇవ్వకూడదని హెచ్చరించారు. 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ప్రతిగృహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

'పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలి'

అనకాపల్లి రూరల్: జిల్లాలోని పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని దొడ్డి రామానాయుడు కార్మిక కర్షక భవనంలో జరిగిన డీవైఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో విద్యార్హతలను బట్టి స్థానికులకు 75 శాతం ఉద్యో గాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. సమావేశంలో 12 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా సీహెచ్ శివాజీ, కార్యదర్శిగా ఎస్‌వీ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షునిగా అల్లు రాజు, సహాయ కార్యదర్శులుగా ఎస్.నారాయణరావు, శివలు ఎన్నికయ్యారు.

భూగర్భ శోకం

- యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తరలింపు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



పేటసూదిపురం చెరువులో మట్టి తవ్వకాలు చేసిన దృశ్యం

ఎస్.రాయవరం: మండలంలో ఆదివారం వస్తే చాలు అక్రమ మట్టి తవ్వకాలు జోరందుకుంటున్నాయి. అగ్రహారం శివారు వరాహా నది గట్టున స్వంత స్థలం ఉందని మొదలు పెట్టి గట్టును గుట్టు చాటుగా తవ్వి, యథావిధిగా విక్రయాలకు తరలిస్తున్నారు. సర్వసిద్ధి, పేటసూదిపురం చెరువులో కూడా తవ్వకాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. ఇప్పటికే కొరుప్రోలు, పెదఉప్పలం, వెంకటాపురం, వాకపాడు చెరువుల్లో రహస్యంగా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి.

వీటిపై అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇపుడు గ్రావెల్‌ను కూడా గుట్టుచప్పుడు కాకుండా తరలించేస్తున్నారు. ఈ గ్రావెల్‌ను కొరుప్రోలు, చినఉప్పలం, వేమగిరి, జేవీ పాలెం గ్రామాల ద్వారా రవాణా చేస్తున్నారు. ఇన్ని జరుగుతున్నా నియంత్రించాల్సిన అధికారులు 'మామూళ్ల'గా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడేవారు ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాల్లో మాత్రం మరింత జోరుగా, భారీ ఎత్తున తవ్వకాలకు పాల్పడుతున్నారు. వీటిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తే.. వారు వచ్చేలోగా తరలించేయడం, లేదా.. వీరు ట్రాక్టర్లు, లారీలతో గ్రావెల్ తీసుకెళ్లిన తర్వాత తీరిగ్గా అధికారులు రావడం జరుగుతోందన్న ఆక్షేపణలున్నాయి.

జగనన్న కాలనీలకు కరవు

గత కొన్ని రోజులుగా మండలంలో అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు, తరలింపు జరుగుతోంది. దీనిపై అధికారుల చర్యలు శూన్యం. జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకునేవారు పునాదులు కప్పుకునేందుకు మట్టికోసం నానా తిప్పలు పడాల్సి వస్తోందంటే అతిశయోక్తి కాదు. ఇందుకు అధికారులు నానా నిబంధనలు పెడుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. తమ కళ్లముందే అందుబాటులో ఉన్న మట్టి, గ్రావెల్ తరలిపోతోంది తప్ప, తమకు మాత్రం దొరకట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తవ్విన మట్టి, గ్రావెల్ అంతా రియల్ ఎస్టేట్, బిల్డర్ల కనుసన్నల్లో, అధికారుల అండదండలతోనే జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికారులు పరిశీలించి, అక్రమ మట్టి తవ్వకాలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపడితే సహించేది లేదు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పాయకరావుపేట సబ్ డివిజన్ ఏర్పాటుతో నేను కొత్తగా బాధ్యతు తీసుకున్నా. గ్రామాల్లో పర్యటించి, అక్రమ తవ్వకాలకు పాల్పడే వారిపై ఆరా తీస్తా. అక్రమ తరలింపును అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటా.

– సువ్వారి జగదీశ్వరరావు, డీఈ, ఇరిగేషన్, పాయకరావుపేట

ఎమ్మెల్యే బాబూరావుకు సత్కారం



ఎమ్మెల్యే బాబూరావును సత్కరిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షులు

నక్కపల్లి: ఎమ్మెల్యే, ఎస్సీ, ఎస్టీ అసెంబ్లీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గొల్ల బాబూరావును మండలానికి చెందిన వేంపాడు, గొడిచెర్ల పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాబూరావును మర్యాదపూర్వకంగా కలిసి సహకార సంఘాల నూతన అధ్యక్షులుగా తమకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ మరింతగా అభివృద్ధి చెందేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

చురుగ్గా ఓటరు సర్వే



మునగపాకలో ఓటరు సర్వేలో సిబ్బంది

మునగపాక: మండల వ్యాప్తంగా ఓటరు సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతోందని తహసీల్దార్ పి.ప్రకాశరావు ఆదివారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వే నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 22 లోగా సర్వే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటరు జాబితాలతో అధికారులు ఇంటింటికీ వస్తున్నారని ఎక్కడైనా సవరణలు, తప్పులుంటే వారి దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జాబితాలను త్వరలోనే ఖరారు చేస్తామన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ 18వ వార్డు ఇన్‌చార్జ్ జె.వి.రమణ అన్నారు. ఆదివారం యలమంచిలి ఏఎస్ఆర్ కాలనీలో రైల్వే గేటు వద్ద పార్టీ స్థానిక నాయకులతో కలసి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు వార్డులో మొక్కలు నాటినట్టు తెలిపారు. ఒక్కరు ఇలా ప్రత్యేక రోజుల్లో ఏదో ఒక సేవా కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ ప్రభుత్వంలో యలమంచిలి మున్సిపాలిటీ అన్ని వార్డులు అభివృద్ధి చెందుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసరావు, కృష్ణ, వరహాల బాబు, మణి, రవి, సంతోష్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పోలీసుల ఆత్మీయ సమ్మేళనం



కశింకోటలో 1990 బ్యాచ్ పోలీసుల ఆత్మీయ కలయిక

కశింకోట: కశింకోటలో పోలీసుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. సుమారు 33 ఏళ్ల స్నేహ మాధుర్యాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. 1990 బ్యాచ్‌లో ఉద్యోగంలో చేరిన జిల్లాకు చెందిన పోలీసు కానిస్టేబుళ్లు స్థానిక పీఏసీఎస్ వద్ద ఉన్న విల్లాలో సమావేశమయ్యారు.

ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, శిక్షణ సమయంలో తమ పరిచయాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణ, అనారోగ్యం తదితర కారణాల వల్ల మృతి చెందిన పోలీసు సోదరులకు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ విషయాల గురించి పరస్పరం తెలుసుకున్నారు. సహ పంక్తి భోజనం చేశారు. అంతా కలిసి ఫోటోలు దిగారు. ఆట పాటలతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, అనిల్, సుబ్బారాజు, సాయి, ముబారక్, బోని శ్రీనివాసరావు, రఘు, శంకరరావు, నాయుడు, నరసింగరావు, వాసు భీశెట్టి వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, పూర్ణ, అనంత్ హాజరయ్యారు.

నూకాంబిక అమ్మవారికి వారపు పొద్దు పూజలు



కశింకోటలో నూకాంబిక అమ్మ వారిని పెద్ద పూలమాలతో అలంకరించి నిర్వహిస్తున్న పూజలు

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారపు పొద్దు, ఉద్యోగులు, విద్యార్థులకు సెలవు రోజు కావడంతో అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. పూలమాలలు, చీరలు, రవికెలు, అరటి గెలలు, తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కొందరు అమ్మ వారి జాతర జరిపి, అన్న సమారాధనలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఇదిలా ఉండగా అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా అష్ట లక్ష్మి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాటైన విగ్రహాలకు రంగులు వేసి, తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. వీటి ఏర్పాటుతో ఆలయం మరింత శోభాయమానం కానుందని భక్తులు భావిస్తున్నారు.

ఆదివాసీల పాదయాత్రకు మద్దతు

తుమ్మపాల: ఆదివాసీల సాగులో ఉన్న భూములకు రక్షణ కల్పించి, అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కన్వీనర్ కొల్లి సత్యారావు కోరారు. ఆదివాసీ సాగు రైతుల పాదయాత్రకు సంఘీభావం తెలియజేస్తూ పట్టణంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములపై వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నం నుంచి అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వరకు తలపెట్టిన పాదయాత్రకు మద్దతు తెలుపుతున్నామన్నారు.

మహిళా పోరు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



హింసపై మహిళా పోరు యాత్ర బహిరంగ సభ పోస్టర్ల ప్రదర్శన

కశింకోట: హింసపై మహిళ పోరు యాత్ర కార్యక్రమం ముగింపులో భాగంగా ఈ నెల 8న విజయవాడలో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి కోరారు. ఈ మేరకు ఆదివారం కశింకోటలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 28 నుంచి హింసపై మహిళల పోరు యాత్ర ప్రచార జాతా నిర్వహించినట్టు తెలిపారు. ఈ యాత్ర ముగింపులో భాగంగా విజయవాడలోని జింఖానా మైదానంలో బహిరంగ సభ జరగనుందన్నారు. సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, వివిధ సంఘాల ప్రతినిధులు జి.అమ్మాజీ, ఎం.తారక, కె.చినఅప్పలనరస, ఆర్.యశోద, ఇ.మహాలక్ష్మి, వై.ఆదియమ్మ, సీత తదితరులు పాల్గొన్నారు.

మీనామృతం పంటలకు బలమైన టానిక్

ప్రకృతి వ్యవసాయం డీపీఎం లచ్చన్న



కుంచంగిలో మీనామృతం తయారీ, ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: మీనామృతం(చేప ద్రావణం) అన్ని పంటలకు బలమైన టానిక్‌లా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం లచ్చన్న అన్నారు. మండలంలోని కుంచంగి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు మీనామృతం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఆదివారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనినే ఫిష్ ఎమినో యాసిడ్ అంటారని, ఇది మొక్కలకు పోషకాలను అందించడంతో పాటు భూసారాన్ని పెంపొందిస్తుందన్నారు. మీనామృతం తయారీకోసం కేజీ నల్ల బెల్లం, లీటరు నీరు, కేజీ చేప వ్యర్థాలు సరిపోతాయన్నారు. వీటిని 27 రోజులు నిల్వ ఉంచితే మీనామృతం తయారవుతుందన్నారు. ఇది 6 నెలలు నిల్వ ఉంటుందని పేర్కొన్నారు. పంట దిగుబడుల నాణ్యత కూడా చాలా బాగుంటుందన్నారు. మొక్కల పెరుగుదల దశలో దీనిని వినియోగించాలన్నారు. రైతులంతా రసాయన ఎరువుల వినియోగాన్ని వదిలి, ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో కరణం వెంకటరమణ, సర్పంచ్ పల్లెల నాగలక్ష్మి, పల్లెల నాగేశ్వరావు, వరాహవెంకటలక్ష్మి, సత్యారావు, కె.కుమారి, వీరవతి, హేమలత పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజయం సాధించిన న్యాయమూర్తి శివకిరణ్ జట్టు

అనకాపల్లిటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివకిరణ్‌లు అన్నారు. మండలంలోని కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల క్రీడామైదానంలో అనకాపల్లి జిల్లా న్యాయస్థానం అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మధ్య 76వ స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో న్యాయమూర్తి శివకిరణ్ జట్టు విజయం సాధించింది. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో తుది విజేతలకు ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ సభలో బహుమతి ప్రదానం చేయనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలక్ష్మణ్, కార్యదర్శి సోరా శ్రీనివాసరావు వెల్లడించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్యదర్శి ఈశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో పార్టీ మరింత బలోపేతం



బొడ్డేడ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, స్థానిక నాయకులు

ఎస్.రాయవరం: జిల్లాలో పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. అనకాపల్లి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా నియోజకవర్గం విచ్చేసిన బొడ్డేడ ప్రసాద్‌కు ఘన స్వాగతం పలికారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు మేలు చేకూరేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని, దీంతో పార్టీని, జగన్‌ను ఆరాధించేవారు బాగా పెరిగినట్లు తెలిపారు. కార్యకర్తలు చురుగ్గా పని చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ నక్కపల్లి అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, స్థానిక నాయకులు శ్రీపతిరాజు, మైలారు శ్రీనివాసరావు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణిస్తే ఉజ్వల భవిత



మాట్లాడుతున్న మునగపాక ఎస్ఐ ఆలీ

మునగపాక: విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని మునగపాక ఎస్ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ తెలిపారు. స్థానిక నేషనల్ జూనియర్, డిగ్రీ కళాశాలల ఫ్రెషర్స్‌డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలీ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువులో ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. ప్రణాళికాపరంగా చదువుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. కష్టపడి చదువుకున్న వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లితండ్రులకు, కళాశాలకు పేరు వచ్చేలా చదువుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం డిగ్రీ, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.బాల సంజీవరావు, జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బి.మహేష్, ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ వేగి శ్రీనివాసరావు, ప్రణతి స్కూల్ కరస్పాండెంట్ ఆడారి సతీష్, వైస్ ప్రిన్సిపల్ కె.ఈశ్వరరావు, డైరెక్టర్లు బి.శంకరరావు, బి.గీత,సిబ్బంది బాల గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు అలవాటు చేయొద్దు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంఈవో గాంధీ, డాక్టర్ పసగడుగుల

పాయకరావుపేట: ఆధునిక యుగంలో చిన్న వయసులోనే స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడి కొట్టుమిట్టాడుతున్నారని స్థానిక హైమ నేత్రాలయం డాక్టర్ పసగడుగుల శివరాజాప్రసాద్ అన్నారు. స్మార్ట్ ఫోన్లకు అలవాటుపడి, కంటిచూపు మందగించడంతోపాటు, అనారోగ్యాలను కొనితెచ్చుకున్న వారిలో చైతన్యం కలిగించేలా ఆయన రూపొందించిన పోస్టర్‌ను స్థానిక ఎంఈవో కె.ఎస్.గాంధీ చేతులమీదుగా ఆదివారం ఆవిష్కరించారు. పిల్లలు శారీరక శ్రమ, మానసిక ఉల్లాసానికి దోహదపడే ఆటలు ఆడుకోవడం, పేరెంట్స్, స్నేహితులతో సమయం గడిపేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ఎంఈవో గాంధీ మాట్లాడుతూ పిల్లలు స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడకుండా, వారిలో విజ్ఞానాన్ని పెంచి, వినోదాన్ని కలిగించే మార్గాలు చాలా ఉన్నాయన్నారు. ఈ పోస్టర్లను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందించనున్నట్లు డాక్టర్ తెలిపారు. వీరిని డాక్టర్ అడపా ప్రకాష్ మాస్టర్ సత్కరించారు.

కనకదుర్గ లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కమిటీని అభినందిస్తున్న సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో కనకదుర్గ లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షునిగా రాజాన నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గోవాడ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ద్వారపురెడ్డి బాబ్జి, కార్యదర్శిగా మామిడి సురేష్‌కుమార్, కోశాధికారిగా రెడ్డి నాగప్పారావులు, సభ్యులుగా శెట్టి చిరంజీవి, గనిశెట్టి గణేశ్, గనిశెట్టి రమణ, జనపరెడ్డి వెంకటేష్, బొండా అప్పారావు, రొంగలి సత్తిబాబు, రాజాన గోపి, రాజన రాజు, లాలం సురేష్, పంచదార్ల నర్సింగరావులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ లారీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

రైతు సంక్షేమానికి నిరంతర కృషి

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్
- సొంత నిధులతో తగరంపూడి గ్రోయిన్ గేట్లకు మరమ్మతులు



తగరంపూడి గ్రోయిన్ గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్: రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని తగరంపూడి గ్రోయిన్ గేట్లను ఎత్తి దిగువన ఉన్న ఆయకట్టు భూములకు శారదానదిలో సాగునీటిని విడుదల చేశారు. అనకాపల్లి నియోజకవర్గంలో ఇటీవల పలు గ్రోయిన్లను పరిశీలించిన ఆయన ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కోసం రైతుల సాగు నీటి అవసరాల దృష్ట్యా తన సొంత నిధులతో అత్యవసరంగా తగరంపూడి గ్రోయిన్ గేట్లకు మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు అవసరాల కోసం నీటిని విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రోయిన్ల గేట్లు శిథిలం కావడంతో నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లిపోతోందన్నారు. దీనికి శాశ్వత మరమ్మతుల కోసం సమగ్రమైన ప్రతిపాదనలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. త్వరలోనే గ్రోయిన్ల మరమ్మతు పనులకు నిధులు విడుదల అవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రత్నాకర్‌ను శాలువాలతో సత్కరించారు. తమకు అండగా ఉన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక నాయకులు నడిమిపల్లి కాశీబాబు, పాతలపాటి సురేష్‌బాబు, రవి రాజ్, పాకలపాటి రాజబాబు, బొడ్డపాటి చినరాజారావు, యాదగిరి రామచంద్రరావు, యన్నంశెట్టి శ్రీనివాసరావు, దాడి గణేష్, బోయిన రమణ, ఇంటి త్రినాథ్, మందారపు కుమార్, నమ్మి శ్రీను, ఉంద్రాల కన్నారావు, బుద్ధ శివనాయుడు, సాలారపు నాగేంద్రబాబు, కర్రి బాబూరావు, బోయిన శ్రీను, లెక్కల నాయుడు, రైతులు పాల్గొన్నారు

ఘనంగా సత్తెమ్మతల్లి ఉత్సవం



తాళ్లపాలెంలో సత్తెమ్మ తల్లికి పూజలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద కొండపై వెలసిన సత్తెమ్మ తల్లి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. చీర, రవిక, పండ్లు వగైరా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.